క్లుప్తంగా

రేపు ఫర్టీకేర్ సంతాన సాఫల్య శిబిరం

దర్శి: సంతానం లేదని బాధపడే దంపతుల కోసం ఒంగోలు ఫర్టీకేర్ సంతాన సాఫల్య కేంద్రం వారు ఈ నెల 24వ తేదీ దర్శిలో ఉచిత శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు ఉజ్వల జ్యోస్తి, శ్రావణిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పీజీఎస్ తాలూకా క్లబ్ సమావేశ మందిరంలో శిబిరం జరుగుతుందన్నారు. పురుషుల్లో వీర్యకణాల సమస్యలు, స్త్రీలలో పదే పదే గర్భం కోల్పోవడం వంటివాటికి ప్రత్యేక చికిత్స చేయనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 94907 78566, 89199 52903, 95027 61756 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: మండలంలోని గురిజేపల్లిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతారని, అన్ని శాఖలకు చెందిన అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు కూడా హాజరు కావాలని కోరారు.

రేపు కంటి వైద్య శిబిరం

యర్రగొండపాలెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24న మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు క్యాంపు ఎగ్జిక్యూటివ్ నాగబాబు శుక్రవారం తెలిపారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ సౌజన్యంతో గుంటూరు జిల్లా పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, రూరల్ హోప్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన వారికి ఉచితంగా కంటి లోపల అద్దాలు అమర్చే శస్త్ర చికిత్స, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాన్ని యర్రగొండపాలెం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు (ముండ్లమూరు): పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై వాటి పోషకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిణి బేబీరాణి సూచించారు. మండలంలోని బొద్దికూరపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలోని పశుపోషకులకు సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు పడే సమయంలో పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

పుల్లలచెరువు: జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో మరియదాసు కోరారు. హౌసింగ్ డే సందర్భంగా మండల కేంద్రంలోని జగనన్న లేఔట్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అవసరమైన వారికి బిల్లులు వెంటనే చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసరావు, ఏపీఎం వెంకటయ్య, ఏపీవో ఎలీషా పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన పూర్తి

కురిచేడు:మండలంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ జ్వాలానరసింహం పరిశీలించారు. బూత్‌లలో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఉండేలా విద్యుత్, తాగునీటి సరఫరా, గాలి, వెలుతురు వచ్చేలా ఉందా.. లేదా.? అని పరిశీలించారు. పోలింగ్ బూత్ నంబర్ 48 నుంచి 87 వరకు పరిశీలించగా మండలంలోని కొత్తనాంచారపురంలో పాత బూత్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉందని, దానిని కొత్తగా నిర్మించిన పాఠశాలలోకి మార్చాలని, పాతకల్లూరు గ్రామంలో పోలింగ్ బూత్‌ను పాఠశాలలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్ఐ శేషగిరి ఉన్నారు.

ముళ్ల చెట్లు తొలగింపు

యర్రగొండపాలెం: మండలంలోని అమానిగుడిపాడు నుంచి పెద్దారవీడు మండలం కుంటకు వెళ్లే దారి ముళ్లచెట్లతో మూసుకొని పోయి ఉంది. ఆ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిలను కోరారు. స్పందించిన వారు శుక్రవారం జేసీబీని కేటాయించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగింపజేశారు. అమానిగుడిపాడు గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

108 సిబ్బందిని కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌గా గుర్తించండి

దర్శి: 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న ఈఎంటీ, పైలెట్ ఉద్యోగులను వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఎంప్లాయీస్‌గా గుర్తించాలని శుక్రవారం దర్శిలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేశారు. ఉద్యోగులు మహబూబ్‌బాషా, బ్రహ్మారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

వెళ్లిరా...వినాయకా..


నిమజ్జనం కోసం బయల్దేరుతున్న భక్తులు


గొట్లగట్టులో గణేశుడికి పూజలు


తర్లుపాడులో గణనాథునికి పూజలు చేస్తున్న రామసుబ్బారెడ్డి


చినారికట్లలో అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల


పెద్దారవీడులో ఊరేగుతున్న వినాయకుని విగ్రహం


కురిచేడు : తూర్పు హరిజనవాడలో గణపయ్య ఊరేగింపు


మార్కాపురం హ్యాపీ హోమ్స్ వేలంలో లడ్డూ దక్కించుకున్న సంతోషంలో యూత్ సభ్యులు


రామాపురంలో స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు


దొనకొండ : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

మార్కాపురం: గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు కోలాహలంగా సాగుతున్నాయి. మార్కాపురం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గణేశుడి ప్రతిమలకు ఐదో రోజు గురువారం విశేష పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మార్కాపురం పట్టణంలోని మార్కెట్ సెంటర్, జవహర్‌నగర్ కాలనీ, తర్లుపాడు రోడ్డు, కంభం రోడ్డు, అమ్మవారిశాల లైన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కమలా హ్యాపీ హోమ్స్‌లో శుక్రవారం స్వామివారి లడ్డూకు వేలం నిర్వహించగా హ్యాపీ హోమ్స్ యూత్ సభ్యులు రూ.30,516కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ పి.కేశవరావు, పవన్‌కుమార్, దినేష్‌కుమార్, అవినాష్, విష్ణు, శ్రీరామ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టులో మెయిన్ బజారు, రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలించారు. చినారికట్ల శివాలయం వద్ద మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ ప్రారంభించారు.

పొదిలి రూరల్: మండలంలోని రామాపురం, రాములవీడు, పాములపాడు గ్రామాల్లో గణనాథుల నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారికి భక్తులు అడుగడుగునా హారతులిచ్చారు.

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులోని మెయిన్ బజారులో గణేష్ యూత్, ఆర్యవైశ్య మండల యూత్, యాదవ యూత్, చెన్నారెడ్డిపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.రామసుబ్బారెడ్డి మెయిన్‌బజారులో ఏర్పాటు చేసిన స్వామివారికి పూజలు నిర్వహించారు.

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

దొనకొండ: మండలంలోని వెంకటాపురం, యర్రబాలెం, ఇండ్లచెరువు, మల్లంపేట గ్రామాల్లో గణనాథుడి నిమజ్జనం కార్యక్రమాలను శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. 5 రోజులుగా ప్రత్యేక పందిళ్లలో పూజలందుకున్న వినాయక విగ్రహాలను తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. యువకులు గులాములు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. సాగర్ కాలువ వద్దకు ట్రాక్టర్లపై వినాయక ప్రతిమలను తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

ముండ్లమూరు మండలంలో...

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద గణనాథుని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని భీమవరం, ఈదర, బంగారమ్మగుట్ట, ముండ్లమూరు, చింతలపూడి, పోలవరం, రాజగోపాలరెడ్డినగర్, వేముల, తమ్మలూరు, ఉల్లగల్లు గ్రామాల్లో ఐదో రోజు వినియక విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. ముండ్లమూరులో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పది కేజీల లడ్డూను గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బొల్లెపల్లి హనుమంతరావు 8700కు వేలంపాటలో దక్కించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం

గిద్దలూరు రూరల్: వినాయక చవితి పండగ సందర్భంగా పట్టణంలోని గణేష్‌నగర్, 5వ వార్డులోని చాకలి వీధి, నంద్యాల రోడ్డులోని కారు పార్కింగ్ వద్ద, జువ్విళ్ల బావి సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్‌లోని వినాయకుడి విగ్రహాలకు 5వ రోజు శుక్రవారం భక్తులు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు. పట్టణంలోని పలు వీధుల్లో వినాయకుడి విగ్రహాలను ఉంచిన వాహనాలను ఊరేగించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శర్మ వీధి యూత్ ఆధ్వర్యంలో జువ్విళ్ల బావి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో మొట్ల వెంకటరామిరెడ్డి, ఆయన కుమార్తె షణ్ముక అంజలి రూ.53 వేలకు దక్కించుకున్నారు. వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం కోసం రాచర్ల మండలం రామన్న కత్తువకు తరలించారు.

యర్రగొండపాలెం: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడికి శుక్రవారం భక్తులు కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

పుల్లలచెరువు: స్థానిక గాంధీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన గణేష్‌డికి కన్నుల పండువగా నిమజ్జనోత్సవం శుక్రవారం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఐదో రోజు విగ్రహాన్ని చిన్నా పెద్దా తేడా లేకుండా పాటలు, డీజేలతో యువకుల కేరింతలతో నిమజ్జనోత్స కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి సమర్పించిన 50 కేజీల లడ్డూకు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

కురిచేడు మండలంలో...

కురిచేడు: స్థానిక తూర్పుహరిజనవాడ, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన గణపయ్యలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలు ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులు స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన మ్యూజికల్ బ్యాండుతో పాటు ఆంజనేయస్వామి వేషధారణ, వివిధ వేషధారణలతో అలరించారు.

పెద్దారవీడు: మండలంలోని పెద్దారవీడు, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో ఐదు రోజుల పాటు వినాయకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుని విగ్రహం ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు శుక్రవారం కోలాహలంగా సాగింది. పెద్దారవీడులో అర్చకులు మేడవరం రాఘవేంద్ర వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఊరేగింపులో మహిళలు, యువకులు తరలి వచ్చి ఆటపాటలతో సందడి చేస్తూ ముందుకు సాగారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. గురువారం వినాయకుని చేతిలోని లడ్డూ, కలశం, ఎలకాయలు, నిమ్మకాయలు భక్తుల సమక్షంలో కమిటీ సభ్యులు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన పాక్లెస్ యజమాని అల్లు వెంకటరెడ్డి రూ.40 వేలకు లడ్డూ, కలశం గొట్టం వెంకటరెడ్డి రూ.10 వేలకు దక్కించుకున్నారు. ఊరేగింపు అనంతరం ఊరి చివర ఉన్న చెరువులో వినాయకున్ని నిమజ్జనం చేశారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు


గెలుపొందిన విద్యార్థులతో పీఈటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఏర్వ వెంకటేశ్వరరెడ్డి


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

దర్శి: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు దర్శి మోడల్ స్కూల్లో శుక్రవారం రెండోరోజు ఉత్సాహంగా జరిగాయి. క్రీడాకారులు పోటీపోటీగా తలపడ్డారు. ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ సోము అంజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వాసుబాబు, సుబ్బారావు, కాలేషా క్రీడలను ప్రారంభించారు.

క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలి

పెద్దారవీడు: పిల్లలను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఏనుగులదిన్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను శుక్రవారం విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు ఏర్వ వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఐదు మండలాలకు చెందిన విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగ క్రీడలను హెచ్‌ఎం ఊటుకూరి మధుసుదన్‌రావు పర్యవేక్షణలో పీఈటీలు నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచి విద్య ఎంతో ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యమని, అందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల కోసం ఎంతో ఖర్చు పెడుతున్నారని తెలిపారు. విశ్రాంత హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, క్రమశిక్షణతో రాణించాలని, ప్రస్తుతం సమాజంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, పీఈటీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: క్రీడల్లో విద్యార్థులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని మండల కో ఆర్డినేటర్ జి.శోభన్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి త్రోబాల్ క్రీడలను గురువారం ప్రారంభించి శుక్రవారం నాటికి ముగించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతు విద్యార్థులకు క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని సైతం కలిగిస్తాయని చెప్పారు. అండర్-14, అండర్- 17 బాలికలు ఖోఖో విన్నర్స్ బేస్తవారిపేట మండలం, అండర్-17 బాలికలు కబడ్డీ విన్నర్స్ అర్ధవీడు, అండర్-17 టెన్నికాయిట్ గర్ల్స్ విన్నర్స్ బేస్తవారిపేట, అండర్ 17 గర్ల్స్‌త్రో బాల్ గిద్దలూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. పీఈటీలు ధనలక్ష్మి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

225 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు

పుల్లలచెరువు: మండలంలోని గారపెంట గిరిజన గూడెంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలో 225 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ స్వామి తెలిపారు. గారపెంట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరంలో ఒంగోలుకు చెందిన వెంకట రమణ, కమలా నర్సింగ్‌లకు చెందిన డాక్టర్లు పాల్గొని గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ఐరన్, ప్రొటినెక్స్ డబ్బాలు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ టి.లక్ష్మీదేవి ప్రారంభించారు. ఆరోగ్య సిబ్బంది ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, ఆరోగ్యమిత్రలు శేఖరాచారి, ప్రభాకర్, లింగయ్య పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

ముండ్లమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంపీడీఓ హనుమంతరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమలలో భారీ వర్షం

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట నల్లమల అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కారణంగా నల్లమల అటవీ ప్రాంతంలోని సగిలేరు వాగులోకి వర్షపు నీరు వచ్చి చేరింది. కేఎస్ పల్లె గ్రామ సమీపంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో సగిలేరు వాగు పారింది. వర్షపు నీరు చూసేందుకు సమీపంలోని గ్రామస్తులు పెద్ద ఎత్తున వాగు వద్దకు చేరుకుని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వాగు వద్దకు ఎస్ఐ మహేష్ తన సిబ్బందితో సహా చేరుకుని ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వాగు ప్రవాహం వైపు ప్రజలను వెళ్లనివ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

మార్కాపురం టౌన్: విజయవాడలో అక్టోబర్ ఒకటో తేదీన నిర్వహించనున్న 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని వీఆర్ఏలు విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో వీఆర్ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రతి రైతు ఈ–క్రాప్ చేయించుకోవాలి


ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ


పంట నమోదు చేస్తున్న ఏఓ


మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి సంధ్య

కురిచేడు: ప్రతిరైతు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వలన పంటనష్టం జరిగినప్పుడు పరిహారం అందుతుందని ఉద్యానవన శాఖాధికారి డి.సంధ్య తెలిపారు. మండలంలోని ఆవులమంద, కల్లూరు, దేకనకొండ గ్రామాల్లో మిరప, బత్తాయి తోటల్లో ఈ క్రాప్ నమోదును శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు కచ్చితంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి యాజమాన్యం చేపట్టాలన్నారు. ప్రస్తుతం మిరప తోటల్లో ఆకుముడత కనబడుతోందని, గుళికలు ఎకరానికి ఎనిమిది కిలోలు దుక్కిలో నాటిన 15 రోజులకు, 30వ రోజు వేసుకోవాలని సూచించారు. ఫిప్రోనిల్ 2 మి.లీ మందుకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ పసుపు, నీలం రంగు అట్టలను పొలాల్లో పెట్టాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలకు రైతు భరోసా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

కొనకనమిట్ల: పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. శుక్రవారం వాగుమడుగు గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటకు జియో కోఆర్డినేట్ల వివరాలతో ఫొటోలు తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను ఈ నెల 30వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 18667 ఎకరాలు కాగా 3,040 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగుచేశారన్నారు. ఆర్బీకేల్లో ప్రస్తుతం 12 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఈ–క్రాప్ బుకింగ్‌ను వినియోగించుకోండి

దొనకొండ: ఈ క్రాప్ బుకింగ్ చివరి తేదీ ఈ నెల 30 అని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఒబ్బాపురం, యర్రబాలెం గ్రామాల్లో చేపట్టిన పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. దొనకొండ మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 14 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, ఇప్పటి వరకు 9 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన రైతులు ఆర్బీకే సిబ్బందితో ఈ నెల 30లోపు ఈ క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలన్నారు. వరి, మిరప నాట్లు వేస్తున్నారని, దానికి సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ త్వరగా పూర్తి చేయాలని ఆర్బీకే సిబ్బందికి ఏఓ సూచించారు. ఆయన వెంట రవితేజ, విన్నీబాబు, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వం చేయూత


మినరల్ మిక్చర్ అందజేస్తున్న జేడీ బేబీరాణి

దర్శి: పాడి రైతుల అభ్యున్నతికి కో ఆపరేటివ్ బ్యాంక్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తూ ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి పేర్కొన్నారు. కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ రుణమేళాలో బేబీరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కో ఆపరేటివ్ బ్యాంక్‌ల ద్వారా పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల రుణ సదుపాయాల గురించి వివరించారు. పొందిన రుణాలతో గేదెలు, ఆవులు కొనుగోలు చేసి జగనన్న పాలవెల్లువ కేంద్రాల్లో పాలు పోయాలని కోరారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ పురుషోత్తంరాజు, రాజంపల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ నాగమణి, సర్పంచ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో శాంతిని కాపాడాలి

మార్కాపురం: భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశాన్ని విచ్ఛిన్నశక్తుల నుంచి కాపాడుకోవాలని, మతోన్మాద శక్తులను ఐకమత్యంగా ఎదుర్కొని శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఎంపీజే ఆధ్వర్యంలో భారతదేశ పరిస్థితులు–మన కర్తవ్యం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో మైనార్టీ, బలహీన వర్గాలపై పాలకులు దాడులు చేయించి అశాంతిని నెలకొల్పుతున్నారని ఆరోపించారు. ప్రజల మధ్య సమానత్వం కోసం పోరాటం కొనసాగిస్తామన్నారు. జేఐహెచ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అష్రఫ్ అలీ, ఎంపీజే నాయకులు రసూల్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు బీవీ సుదర్శన్, ప్రజా సంఘాల నాయకులు ఇస్మాయిల్, ఖాశీం, జె.నాగయ్య, ఏ.లూకా, గురవయ్య, ఇస్మాయిల్, మహిళా నాయకులు రోజీలిడియా, రెహానా, హెప్సిబా, సికిందర్, మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల వేతన సమస్యను పరిష్కరించాలి

మార్కాపురం టౌన్: ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల వేతన సమస్యను పరిష్కరించాలని మార్కాపురం డీవైఈఓ చంద్రమౌళీశ్వర్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. జూన్‌లో జరిగిన బదిలీల్లో పదోన్నతి పొంది ఉన్నత పాఠశాలలకు వచ్చిన ప్రధానోపాధ్యాయులకు జూన్, జూలై నెలలో అకౌంట్ 04 హెడ్ ఆఫ్ ది అకౌంట్ కింద ఉందని, ఆగస్టు నెల జీతంలో హెచ్‌ఎంలకు హెడ్ ఆఫ్ ది అకౌంట్‌ను రద్దు చేసి ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు ఒకే హెడ్ ఇచ్చారని తెలిపారు. అయితే ట్రెజరీ అధికారులు మాత్రం వేర్వేరు హెడ్ ఆఫ్ ది అకౌంట్లు ఉండాలని పేర్కొంటూ వేతన బిల్లులు రద్దు చేశారని వివరించారు. వెంటనే వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ ప్రధానోపాధ్యాయులు వై.సుబ్బారెడ్డి, పి.వెంకటరావు, ఎం.తిరుపతిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓవీ వీరారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరరెడ్డికి ఘన సన్మానం

కంభం: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడిగా ఇటీవల ఎంపికైన పట్టణానికి చెందిన ఎస్ఎల్‌వీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ నరాళ ఈశ్వరరెడ్డిని, జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.ప్రభాకర్‌రెడ్డిని యోగి వేమన రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక రెడ్ల సంక్షేమ సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి మాట్లాడారు. పశ్చిమ ప్రకాశం వాసిని యూనివర్శిటీ పాలకమండలి సభ్యుడిగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి సాంబశివారెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చెన్నారెడ్డి, శివశంకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, రామభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ట్యాబ్‌లు సక్రమంగా వినియోగించాలి

యర్రగొండపాలెం: ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు విద్యా విషయాలకు మాత్రమే ఉపయోగించాలని ఎంఈవో పి.ఆంజనేయులు ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని మురారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్స్‌ను ఎన్ని గంటలు ఉపయోగించింది, ఎన్ని పాఠాలు చదివింది, ఎన్ని పరీక్షలు రాసింది అందులో నిక్షిప్తమై ఉంటాయని వివరించారు. ట్యాబ్‌ను ఎక్కువ గంటలు ఉపయోగించిన విద్యార్థులను ఆయన అభినందించారు. విన్సెంట్, శ్రీనివాసరావు, ఎంఎస్‌పీ ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.